క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ విజేతగా బుర్రిలంక



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న సర్పంచ్ పాతంశెట్టి రాంజీ

కడియం: సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో బుర్రిలంక జట్టు విజేతగా నిలిచింది. బుర్రిలంక ప్రాథమిక పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన ఈ టోర్నీలో మండలంలోని 11 గ్రామాల నుంచి జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్‌లో కడియంపై బుర్రిలంక విజయం సాధించింది. విజేతలకు కడియపులంక సర్పంచ్ పాతంశెట్టి రాంజీ మెమొంటో, నగదు అందజేశారు. బుర్రిలంక పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రౌండ్ సభ్యులు కట్టా శివ, పుల్లా ఎస్ఆర్ నాగిరెడ్డి దొరబాబు, పాతంశెట్టి పట్టాభి, చిన్న రాము తదితరులు పాల్గొన్నారు.

23న ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరంలోని కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 23న అమర్‌రాజా కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ రాధాకృష్ణన్ తెలిపారు. ఐటీఐలో సివిల్ మినహా మిగిలిన అన్ని ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించి, అప్రెంటిస్ సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులందరూ అర్హులన్నారు. ఎంపికైన వారికి పీఎఫ్, ఎస్ఏఎస్, గ్రాట్యూటీ అందజేస్తారన్నారు.

25న లోకల్ సెలబ్రిటీ షో

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ రంగంపై ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించేందుకు తెలుగు రాష్ట్రాల్లో లోకల్ సెలబ్రిటీ షోస్ నిర్వహిస్తున్నట్లు హాస్యనటుడు డాక్టర్ భద్రం తెలిపారు. దానిలో భాగంగా స్థానిక ఆనం కళాకేంద్రంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు తొలి సెలబ్రిటీ షో జరుపుతున్నామన్నారు. నటన, పాటలు, డ్యాన్సులపై ఆసక్తి ఉండి, ఇందులో పాల్గొనాలనుకునే వారికి ఈ నెల 18, 19వ తేదీల్లో డెల్టా హాస్పిటల్ పక్కనే గల స్ప్రింట్ ఆన్ ఫిట్నెస్ స్టూడియోలో ఆడియన్స్ జరుగుతాయన్నారు.

మహిళ మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన పాడిశెట్టి దుర్గాంబిక (30)కు ఉద్దండ శ్రీనివాసరావుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు వెల్డింగ్ వర్కు చేస్తుండగా, దుర్గాంబిక దేవీచౌక్‌లోని ఓ హోటల్లో పనిచేస్తోంది. ఆమె ఐదు రోజుల క్రితం పక్క వీధిలోనే ఉంటున్న తండ్రి వెంకట రమణ ఇంటికి కుటుంబంతో వెళ్లింది. 15వ తేదీ సాయంత్రం తన చిన్న కుమారుడిని తీసుకుని ఇంటికి వెళ్లిపోయింది. అయితే 16వ తేదీ ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమె భర్త చాకుతో చీరను కోసి కిందకు దించి ఆమె తండ్రికు కబురు పంపాడు. దుర్గాంబికను చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. కాగా.. దుర్గాంబిక తరచూ చాలా కోపం వస్తుందని, దాని కారణంగానే ఆమె ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి వెంకట రమణ ఫిర్యాదులో తెలిపాడు. బొమ్మూరు ఎస్సై రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు డీఎస్పీల రాక

కంబాలచెరువు: నగరానికి కొత్తగా ఇద్దరు డీఎస్పీలు బదిలీపై రానున్నారు. సౌత్ జోన్ డీఎస్పీగా వై.శ్రీకాంత్, నార్త్ జోన్ డీఎస్పీ బి.విద్యను నియమిస్తూ శుక్రవారం రాత్రి పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

క్రీడల్లో విద్యార్థుల సత్తా

- పతకాలు సాధిస్తున్న విద్యార్థులు
- జాతీయ పోటీలకు ఎంపిక





వాలీబాల్ పోటీలకు ఎంపికైన వెంకట శివ, సుధీర్ కుమార్



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

ప్రకాశం నగర్: నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. జాతీయ పోటీలకు ఎంపికై సత్తా చాటుతున్నారు. వీరితో రాజమహేంద్రవరం ఖ్యాతి జాతీయ స్థాయికి చేరిందని పలువురు క్రీడా విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జైపూర్‌లో జనవరి 7 నుంచి ప్రారంభమైన 69వ జాతీయ సీనియర్ వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టుకు గాడాల గ్రామానికి చెందిన గోపిరెడ్డి వెంకట శివ, పెదపూడి గ్రామానికి చెందిన ఎస్.సుధీర్ కుమార్‌లు ఎంపికయ్యారు. రాష్ట్రం తరఫున ఆడుతున్న క్రీడాకారులు ప్రథమ బహుమతి సాధించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షిస్తున్నారు.

టీటీ స్టేట్ చాంపియన్‌గా పావని

ఇటీవల కాకినాడలో జరిగిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ అండ్ స్టేట్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో నగరానికి చెందిన గిడుతూరి సిరి పావని స్టేట్ చాంపియన్ షిప్ సాధించింది. అలాగే జిల్లా మహిళల జట్టు చాంపియన్ షిప్ సాధించడంలో కీలక పాత్ర పోషించింది. అండర్ - 15 బాలికల విభాగంలో తాన్యశ్రీ బ్రాంజ్ మెడల్ సాధించింది.

మంచి భవిష్యత్తు



ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారికి మంచి ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా బాలురతో పాటు బాలికలు సైతం ఆయా క్రీడల్లో రాణించి పతకాలు సాధించడం అభినందనీయం. గతంతో పోలిస్తే ఇప్పుడు యువత క్రీడలపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు.

– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

కొరవడిన ప్రభుత్వ సహాయం

క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందకపోవడంతో క్రీడాకారులు, కోచ్‌లు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు క్రీడా సామగ్రిని అందజేసేవారు. క్రీడాకారులకు అల్పాహారం, భోజనం, వసతి వంటి సౌకర్యాలు ప్రభుత్వమే కల్పించేది. క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించేది. ప్రస్తుత ప్రభుత్వంలో క్రీడాకారులు ఆయా పోటీల్లో ప్రతిభ చూపినప్పటికి, వారికి అవసరమైన శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం వంటి విషయాల్లో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పలువురు క్రీడా విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక వేంకటేశ్వర నగర్‌లోని పార్కులో శుక్రవారం ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. మధుమేహం, కాలేయం పనితీరు, ఎముకల పటుత్వం, బీపీ తదితర వైద్య పరీక్షలను టైం డయోగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం వల్ల వాటి నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంటుందన్నారు. క్లబ్ సభ్యులతో పాటు వెంకటేశ్వర నగర్ వాసులు తరలి వచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు వాసు, సుబ్బారావు, క్లబ్ యోగా గురువులు శెట్టి, రమణ, క్లబ్ ప్రతినిధులు రామమోహన్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పూర్ణచంద్రారెడ్డి ఆశయాల సాధనకు కృషి



పూర్ణచంద్రారెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న శ్రీనివాసులురెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గొందేశి పూర్ణచంద్రారెడ్డి ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామని గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. పూర్ణచంద్రారెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి శ్రీనివాసులు రెడ్డి, ట్రస్టు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం స్వామి వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం, డర్బాస్ హోమ్, ఇవాంజలీ లెప్రసీ కాలనీలో భోజనాలు ఏర్పాటు చేశారు. పండ్లు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల అను, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణాలను కాపాడిన హెల్మెట్

రాజానగరం: అతి వేగం అనర్థదాయకమనే విషయం అందరికీ తెలిసిందే. అయినా ఎవ్వరూ పెద్దగా పట్టించుకోరు. అందుకనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు అతి వేగం కారణంగానే జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే దివాన్ చెరువులో శుక్రవారం జరిగిన ఒక ప్రమాదంలో బైకు నడుపుతున్న వ్యక్తి ప్రాణాలను హెల్మెట్ కాపాడింది. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరానికి చెందిన కె.ప్రేమ్‌కుమార్ మోటారు బైక్‌పై కాకినాడ వెళ్లి తిరిగి వస్తూ దివాన్ చెరువు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. బైకుపై అతివేగంగా వస్తున్న అతడు రోడ్డు పక్కన ఆగి వున్న ట్రాలీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఆ సమయంలో అతడి తలకు హెల్మెట్ ఉండటంతో ప్రాణాలు నిలిచాయి. ఆ వేగానికి ముక్కుకు, నోటికి మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని హైవే పోలీసులు 108 వాహనంలో చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు

కంబాలచెరువు: గంజాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఒకటో ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ ఎం.జగదీశ్వరి శుక్రవారం తీర్పు చెప్పారు. 2019 నవంబర్ 16న అన్నపూర్ణమ్మపేటలో ఆటో డ్రైవర్ బొంతు ప్రసాద్ వద్ద నుంచి అప్పటి వన్‌టౌన్ ఎస్సై పీపీ త్రినాథ్ 200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టు ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఒకటో ఏజేఎఫ్‌సీఎం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవిద్య ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. విచారణ అనంతరం మేజిస్ట్రేట్ పైవిధంగా తీర్పు చెప్పారు.

శ్రీరామపురం వీఆర్వో మృతి

రాజానగరం: మండలంలోని శ్రీరామపురంలో వీఆర్వోగా పనిచేస్తున్న దారా శ్రీరామ్మూర్తి అనే చంటి (47) గురువారం అర్ధరాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. భోగి పండగ రోజు విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురవడంతో అతడిని రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. బ్రెయిన్ స్ట్రోక్‌గా గుర్తించిన వైద్యులు, సర్జరీ చేసి, వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందాడు. అతడికి భార్య, బీటెక్, డిగ్రీ చదువుతున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఔను.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు

- వృద్ధాశ్రమంలో ఇష్టపడిన వృద్ధులు
- వారిద్దరినీ కలిపిన నిర్వాహకుడు రాంబాబు, సిబ్బంది
- స్వర్ణాంధ్రలో వేడుక



వృద్ధ దంపతులతో స్వర్ణాంధ్ర నిర్వాహకుడు రాంబాబు, సిబ్బంది

సీటీఆర్ఐ: ఆమె వయసు 68, అతడికి 64.. వీరిద్దరూ నగరంలోని స్వర్ణాంధ్ర ఆశ్రమంలో ఉంటున్నారు. ఒకరినొకరు ఇష్టపడినా బయటకు చెప్పడానికి సంకోచించారు. ఎట్టకేలకు ఆశ్రమ నిర్వాహకులు చొరవ తీసుకుని వారిద్దరినీ ఒకటి చేశారు. వివరాల్లోకి వెళితే.. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో కడప జిల్లా పెనగలూరు మండలం కమ్మలకుంటకు చెందిన 68 ఏళ్ల గొజ్జల రాములమ్మ, రాజమహేంద్రవరంలోని నారాయణపురం రెండో వీధికి చెందిన 64 ఏళ్ల మడగల మూర్తి ఉంటున్నారు. అక్కడ జరిగే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారు. అందరితో సఖ్యతగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. వీరిద్దరూ రెండేళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నారు.

మూర్తికి సేవలు

మూర్తి పక్షవాతంతో తీవ్ర ఇబ్బందులు పడేవాడు. ప్రతి అవసరానికి ఎవరో ఒకరి మీద ఆధారపడేవాడు. ఆ సమయంలో అతడికి రాములమ్మ సేవలు చేసింది. కొంతకాలానికి అతడు అనారోగ్యం నుంచి కోలుకున్నాడు. సేవలు చేస్తున్న సమయంలో రాములమ్మ, మూర్తి ఒకరికొకరు ఇష్టపడ్డారు. కానీ ఆ విషయం బయటకు చెబితే ఏమనుకుంటారో, ఆశ్రమం నుంచి పంపించేస్తారేమోనని భయపడ్డారు. అయితే ఆశ్రమంలో మిగిలిన వారు వీరిద్దరి విషయాన్ని నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు తెలిపారు.

దండలు మార్పించి..

రాంబాబు, పెద్దలు, అక్కడ ఉన్న వృద్ధులు, సిబ్బంది అందరూ కలిసి చర్చించుకుని రాములమ్మ, మూర్తికి మద్దతుగా నిలిచారు. శుక్రవారం వారిద్దరికీ దండలు మార్పించారు. ఒకరికొకరు తోడు నీడగా ఉండాలని సూచించారు. స్వర్ణాంధ్ర తరఫున రాంబాబు నూతన వస్త్రాలను బహూకరించారు. కేకు కట్ చేసి వృద్ధులకు మిఠాయిలు, అందరికీ తువాళ్లు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది హరికృష్ణ, మీరా కుమారి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా భద్రత ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

సీటీఆర్ఐ: వేగం కంటే భద్రత ముఖ్యమని జిల్లా అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) సుబ్బరాజు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ, ఆటో డ్రైవర్లకు సుబ్బరాజు భద్రత గురించి అనేక విషయాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం, డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయ్ బాబు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మార్క్సిస్టు నేత జ్యోతి బసుకు నివాళి



జ్యోతిబసుకు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వాతంత్య్ర సమర యోధుడు, సీపీఎం వ్యవస్థాపక పొలిట్ బ్యూరో సభ్యుడు జ్యోతి బసు 15వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం శ్యామల సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ మూర్తి తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు. అరుణ్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం నుంచి ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించిన జ్యోతి బసు.. కార్మిక నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీ తొలి తరం నాయకుడిగా జీవితాంతం ప్రజా ఉద్యమంలో కొనసాగారన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రిగా 23 ఏళ్ల పాటు ఆదర్శ పాలన సాగించారన్నారు. ఆయన స్ఫూర్తితో కార్మిక పోరాటాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, జె.రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు కర్రి రామకృష్ణ, బీవీఎస్ పూర్ణిమరాజు పాల్గొన్నారు.

ఖైదీల కేసుల దర్యాప్తుపై సూచనలు



సమావేశంలో పాల్గొన్న జిల్లా న్యాయమూర్తి శివ కుమార్ తదితరులు

కంబాలచెరువు: విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు చేసే విధానంపై పోలీసు అధికారులకు జిల్లా ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్ పలు సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం అండర్ ట్రయిల్ రివ్యూ, ఎగ్జిక్యూటివ్ కమిటీల సమావేశాలు నిర్వహించారు. బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించి, సంబంధిత అధికారులకు సిఫారసులు చేశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు, ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ కె.జానీబాషా, జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించితే అనర్థమే

- ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు
- ఇప్పటికే 95 శాతం వరినాట్లు పూర్తి



పందలపాకలో ఎరువులను కలుపుతున్న రైతులు

బిక్కవోలు: దాళ్వా వరి సాగు ముమ్మరంగా జరుగుతోంది. ముందుగా నాట్లు వేసిన రైతులు ఎరువులు వేసే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 52 వేల ఎకరాలల్లో దాళ్వా వరి నాట్లు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ దాదాపు 95 శాతానికి పైగా పూర్తయినట్లు అంచనా. పంటల దిగుబడిని పెంచడంతో ఎరువుల పాత్ర చాలా కీలకం. అయితే రసాయన ఎరువుల వినియోగంపై పూర్తి అవగాహన లేకపోవడం, పరిసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మించి విచక్షణా రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీనితో సాగు ఖర్చులు పెరిగిపోవడంతో పాటు చీడపీడలు విజృంభిస్తున్నాయి. జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

పరిమితంగా వాడితేనే మంచిది

ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమ భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలోనూ, రెండో దఫా పిలకలు కట్టే దశలోనూ, చివరి దఫా అంకురం దశలోనూ వేసుకోవాలి. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో, మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలోనూ వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని వినియోగం

నత్రజని ఎరువు సమర్థంగా పనిచేయాలంటే చేనులో బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 2.50 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి, రెండు రోజులు నిల్వ ఉంచిన తర్వాత పొలంలో చల్లుకోవాలి. దీని వల్ల మొక్క బాగా పెరుగుతుంది.

పైరులో సూక్ష్మ పోషక లోపాలు

జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తర్వాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకు పచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెలుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 నుంచి 5 వారాల మధ్య పొలంలో ఉన్న నీటిని తీసివేసి కొత్తగా పెట్టాలి. లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

ఇనుప ధాతు లోపం

ఇనుప ధాతు లోపం సాధారణంగా సున్నం ఎక్కువగా ఉండే నేలలు, మెట్ట నారుమడులు వేసే ప్రాంతాలు, అధిక వర్షాలు కురిసిన తరువాత నీరు నిలిచిన పొలాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఆకుల ఈనెల మధ్య భాగం పసుపు రంగుకు మారి క్రమేపీ ఆకు అంతా తెల్లగా తయారై ఎండి పోతుంది. దీని నివారణకు లీటర్ నీటికి 20 గ్రాముల అన్నభేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి రెండు, మూడు పర్యాయాలు పిచికారీ చేయాలి.

అతిగా వాడితే నష్టం



దాళ్వా పంటలో అధిక దిగుబడి సాధించాలని కొందరు రైతులు ఎరువులను ఎక్కువగా వినియోగిస్తారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం కలుగదు. పైగా ఎరువుల అధిక వినియోగంతో ఖర్చు ఎక్కువవుతుంది. చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గేపోయే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ సలహాదారులు ఉన్నారు. వారి సూచనల ప్రకారం ఎరువులను వినియోగించాలి.

– శామ్యూల్ జాన్, వ్యవసాయధికారి, బిక్కవోలు

బాలిక అదృశ్యం

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన బాలిక కనిపించడం లేదని తల్లి (కర్రి సోమేశ్వరి) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. తెల్లవారుజాము 4 గంటలకు తల్లిదండ్రులు చూడగా ఇంటిలో బాలిక కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.